సాక్షి ప్రకాశం

గురువారం। 14। మార్చి। 2024



వైఎస్సార్ సీపీలోకి వంద కుటుంబాలు

ఒంగోలు నగరానికి చెందిన వంద కుటుంబాలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. - 8లో..



లాభాల బాటలో 'ప్రగతి రథం'

ఏపీఎస్ ఆర్టీసీని నష్టాల ఊబి నుంచి లాభాల బాట పట్టించిన ఘనత సీఎం జగన్‌దేనని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 35/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

రంజాన్ వేళలు

గురువారం - ఇఫ్తార్ : సా॥ 6.25

శుక్రవారం - సహరీ : ఉ॥ 4.58



పేదింటి వెలుగులు..

రాష్ట్ర ప్రభుత్వం పేదింట వెలుగులు తెచ్చింది. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ఆర్థికంగా ప్రయోజనం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. ప్రతినెలా రూ.3.23 కోట్ల మేర విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తోంది.

- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్
- ఉమ్మడి జిల్లాలో ఉచిత సర్వీసులు 1,46,683
- గత మూడేళ్లలో రూ.51.84 కోట్లు చెల్లింపు



ఒంగోలు సెంట్రల్: బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ వారికి చేయూతనిస్తోంది. టీడీపీ హయాంలో 50 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ ఉండేది. తర్వాత దానికి వంద యూనిట్లకు పెంచినా సక్రమంగా అమలు చేయలేదు. నేడు ఆ పరిస్థితులు లేవు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 1,46,683 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. 2019 నుంచి 2022 ఫిబ్రవరి వరకు ప్రభుత్వం రూ.51.84 కోట్ల బిల్లులు విద్యుత్ శాఖకు చెల్లించింది.

మీటరు తప్పనిసరి..

ఉచిత విద్యుత్ పథకాన్ని పొందాలంటే ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబం విధిగా విద్యుత్ మీటరు పెట్టుకోవాల్సి ఉంది. కొంత మంది ఉచిత విద్యుత్ కదా మీటరు ఎందుకు అంటూ నిర్లక్ష్యం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 200 యూనిట్ల వరకు ఉచితంగా గృహ అవసరాలకు విద్యుత్ వినియోగించుకోవచ్చు. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా రూ.3.23 కోట్ల మేర వినియోగించుకుంటున్న విద్యుత్‌కు ప్రభుత్వమే నగదు చెల్లిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో 2024 జనవరి 31న విద్యుత్ సంస్థకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చెల్లించిన 2021 నవంబర్ నెల నుంచి 2022 ఫిబ్రవరి వరకు ఉచిత విద్యుత్ బిల్లుల వివరాలు ఇలా ఉన్నాయి...

ఈఆర్‌ఓ స్టేషన్	కస్టమర్ల సంఖ్య	బిల్లు నగదు
అద్దంకి	12,661	1,01,00,925
చీరాల	6,393	44,04,343
కంభం	3,764	21,06,383
దర్శి	8,813	32,95,819
గిద్దలూరు	4,736	24,44,656
కందుకూరు	11,641	63,47,223
కనిగిరి	11,772	52,98,785
మార్కాపురం	7,197	34,28,919
మార్టూరు	10,007	81,95,112
ఒంగోలు రూరల్	28,774	1,56,47,210
ఒంగోలు టౌన్	1703	13,27,878
పర్చూరు	9,899	52,54,031
పొదిలి	8216	28,09,232
సింగరాయకొండ	10,076	62,86,483
వేటపాలెం	4520	24,70,678
వైపాలెం	6511	30,53,054
మొత్తం	1,46,683	8,24,70,731

చాలా సంతోషం



ఎస్సీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం శుభ పరిణామం. గత ప్రభుత్వ హయాంలో 50 యూనిట్ల వరకు ఉచితంగా ఇచ్చే వారు. నేడు 200 యూనిట్ల వరకు ఇవ్వటంతో టీవీ, ఫ్యాన్ వంటి విద్యుత్ వాడటం ఉన్నా సరే బాగా సరిపోతుంది. మీటరు ఉంటే చాలు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోంది.

– జి.చిన్నయ్య, వినియోగదారుడు

అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు



అర్హత ఉంటే చాలు ఎస్సీ, ఎస్టీలు దరఖాస్తు చేసుకుంటే వారికి విద్యుత్ ఉచితంగా అందిస్తారు. ప్రతి నెలా వినియోగం అయిన విద్యుత్‌ను మా శాఖకు విద్యుత్ శాఖ పంపుతుంది. మొత్తంగా బిల్లు సంబంధిత శాఖకు చెల్లిస్తాం. 2024 జనవరి 31న రూ.8.24 కోట్లు చెల్లించాం. 2022 ఫిబ్రవరి వరకు ప్రభుత్వం రూ.51.84 కోట్లు బిల్లులను విద్యుత్‌శాఖకు చెల్లించింది.

– ఎస్ లక్ష్మా నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి, ఒంగోలు.

న్యూస్‌రీల్

31 మంది పాలిటెక్నిక్ విద్యార్థినులకు ఉద్యోగాలు

ఒంగోలు: పాలిటెక్నిక్ డిప్లొమో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు 31 మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించారు. స్థానిక డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం చెన్నైకు చెందిన గోద్రేజ్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్‌కు చెందిన హెచ్‌ఆర్ విభాగం, ఇంజినీరింగ్ ఎక్స్‌పర్ట్‌లు క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ అనంతరం 31 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన వారికి రూ.3 లక్షల వార్షిక వేతనం లభిస్తుందన్నారు. వసతి, భోజనం, ప్రయాణ సదుపాయం, బీమా తదితర సౌకర్యాలు కూడా లభిస్తాయన్నారు. డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి 3, ఈతముక్కల మహిళా పాలిటెక్నిక్ కాలేజీ 15, కందుకూరు 1, వేటపాలెం సెయింట్ ఆన్స్ 5, పేస్ పాలిటెక్నిక్ 5, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు.

16 మరుగు శుద్ధి వాహనాలు మంజూరు

ఒంగోలు అర్బన్: జాతీయ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పీఎం సూరజ్ జాతీయ పోర్టల్ లాంచ్ చేసిన ప్రధాని మోదీ లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖాముఖి నిర్వహించారు. దీనికి అనుసంధానంగా ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం ద్వారా 80 మంది లబ్ధిదారులకు 16 మరుగు శుద్ధి వాహనాల మంజూరు పత్రాలు అందజేశారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యూనిట్ విలువ రూ.5,06,77,216గా ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమంలో స్త్రీ నిధి లబ్ధిదారులతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్స్ బాధ్యత కీలకం

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ ఆఫీసర్లు ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలది కీలక బాధ్యత అని ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని విధులు నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం ప్రకాశం భవనం నుంచి తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, ఈఆర్‌ఓలు, మహిళా పోలీసులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, ఎన్నికల విభాగం అధికారులుపాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- నూతన ప్రభుత్వ భవనాలు ప్రారంభం
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



పొదర్తి గ్రామంలో అర్హులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయం-2ను ప్రారంభించారు. బస్టాండ్ సెంటర్‌లో వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు నాటారు తిరుపతిరెడ్డి సతీమణి తిరుపతమ్మ జ్ఞాపకార్థం రూ.6 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను, రంగాయపాలెంలో రూ.20.80 లక్షలతో పూర్తి చేసిన హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించారు. తరువాత బస్టాండ్ సెంటర్ రూ.9.5 లక్షలతో కల్చరల్ బిల్డింగ్‌కు టెంకాయిలు కొట్టి భూమి పూజ చేశారు. ముస్లిం సామాజికవర్గానికి పంచాయతీరాజ్ శాఖ నిధులతో రూ.9 లక్షలతో ఖబర్‌స్తాన్ ప్రహరీని ప్రారంభించారు.

పొదర్తిలో 120 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ: 20 ఏళ్ల క్రితం ఎస్సీలకు 70 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది తానేనని, ఇప్పుడు 120 మందికి ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. పొదర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలినేని మాట్లాడుతూ 120 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, వీటిలో ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మేము ఇచ్చేవి దొంగ పట్టాలని దామచర్ల జనార్దన్ ప్రచారం చేస్తున్నాడని ఇవి దొంగ పట్టాలు అయితే పార్టీకి రాజీనామా చేస్తావా దొంగ పట్టాలని నిరూపిస్తే నేను రాజకీయంలో మానుకుంటానని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత కోసం అనేక పథకాలు పెట్టారన్నారు. పొదర్తి గ్రామానికి నాల్గొవ విడత 3 వేల మందికి రూ.5.63 కోట్లు వైఎస్ఆర్ చేయూత ఇచ్చినట్లు చెప్పారు. దళారులు లేకుండా ప్రతి పథకం నేరుగా మహిళల ఖాతాలో జమ చేశామన్నారు. నాలుగేళ్లలో టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలు పెట్టి వారికి నచ్చిన వాళ్లకే పెట్టారని గుర్తు చేశారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కల్చరల్ బిల్డింగ్, రైతు భరోసా కేంద్రం, 120 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.40 లక్షలు కేటాయించామని, ఇంటింటికీ కుళాయిలు ఇచ్చే పనులు జరుగుతున్నాయన్నారు. మాగాణి పొలంలోకి వెళ్లడానికి రూ.32 లక్షలతో మట్టి రోడ్డు, దానిపై గ్రావెల్ వేశామన్నారు. ఎస్సీలు సాగు చేసుకున్న పొలాన్ని వారికి నచ్చచెప్పి 120 మందికి పట్టాలు ఇచ్చామన్నారు. 5 గ్రామాలకు ఉపయోగపడే 8 కిలోమీటర్ల దూరంలో తూర్పు వైపు బైపాస్ రోడ్డు కోసం ముందుగా రూ.90 లక్షలతో మట్టి రోడ్డు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. దానిపై గ్రావెల్ రోడ్డు వేయటానికి ఎన్ఆర్‌జీఎస్ ద్వారా రూ.77 లక్షలు మంజూరైందని, త్వరలో పూర్తి చేస్తామన్నారు. తరువాత తారురోడ్డు కూడా వేస్తామని చెప్పారు. సర్పంచ్ కట్టా సౌందర్య భర్త శేఖర్‌బాబు మాట్లాడుతూ సర్వే నంబర్ 465ఏలో 120 మందికి పట్టాలు పంపిణీ చేస్తున్నామంటే ఇది బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారం ఉందన్నారు. ఎవరి దగ్గరా పైసా తీసుకోకుండా పట్టాలు ఇస్తారన్నారు. దొంగ పట్టాలు ఇస్తున్నారని ప్రచారం చేస్తున్నారని ఆ మాటలు నమ్మవద్దన్నారు. మ్యాప్‌లు తయారు చేసి, హద్దురాళ్లు ఏర్పాటు చేసి, రికార్డులో నమోదు చేసి ఇచ్చిన పట్టాలివి అన్నారు. 120 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రూ.5.63 కోట్ల చేయూత చెక్కును పంపిణీ చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు, సొసైటీ అధ్యక్షుడు నాటారు తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పిచ్చిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు బంకా శ్రీధర్, మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, తంబి కాంతారావు, కోడూరి శ్రీను, సర్పంచ్ గాలి స్వరూప, సర్పంచ్ కట్టా సౌందర్య, ఎంపీటీసీ సభ్యురాలు చలంచర్ల తిరుపతమ్మ, గుడి అరుణ, తంబి సురేష్, మరపాల సుధాకర్‌రెడ్డి, బేల్దారి నాగరాజు, తంబి వెంకటేశ్వర్లు, రామలింగం సుధాకర్‌రెడ్డి, గుడి నాగిరెడ్డి, ఆజీమ్ తదితరులు పాల్గొన్నారు.



కొండపిలో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

వైఎస్సార్ సీపీతో మహిళా సాధికారత

- మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- కొండపిలో వైఎస్సార్ చేయూత 4వ విడత చెక్కుల పంపిణీ
- భారీగా హాజరైన మహిళలు

టంగుటూరు: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకు అనుగుణంగానే మహిళల పేరిటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పథకాలకు రూపకల్పన చేశారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కొండపి మండల పరిషత్ కార్యాలయంలో కొండపి, పొన్నలూరు, మర్రిపూడి మండలాలకు వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు మెగా చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళల రుణాలు మాఫీ చేస్తానని, నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తానని ఇలా 600కు పైగా మోస పూరిత హామీలిచ్చిన ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో కొత్త డ్రామా మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు హయాంలో ఏ పథకం పొందాలన్నా టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు తప్పేవి కావని విమర్శించారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటున్న జగనన్నకు అక్కచెల్లెమ్మలంతా అండగా ఉండి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం: వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద కొండపి, పొన్నలూరు, మర్రిపూడి మండలాలకు చెక్కులు పంపిణీ చేశారు. కొండపి మండలంలో 1909 మందికి రూ.3,57,93,750, పొన్నలూరు మండలంలో 1882 మందికి రూ.3,52,87,500, మర్రిపూడి మండలంలో 1656 మందికి రూ.3,10,500 చెక్కును మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగనన్న చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ మారెడ్డి అరుణ కుమారిరెడ్డి, వైస్ ఎంపీపీ కోటరాజు, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గర్నిపూడి రమేష్, పొన్నలూరు ఎంపీపీ కొండాబత్తిన మాధవ, నాయకులు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, మండవ కోటయ్య, యువజన విభాగం నాయకులు మణికంఠరెడ్డి, ఎంపీడీఓ నాగమణి, కొండపి ఏసీ పీ సనిత, కొండపి, పొన్నలూరు, మర్రిపూడి రాజ్యలక్ష్మి, టి.సురేష్, టి.బాబురావు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి





సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, పక్కన జేసీ గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు తదితరులు

- ఎన్నికల సంఘం నిబంధనలు పక్కాగా పాటించాలి
- రెవెన్యూ, పోలీసు శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రాబోయే సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్నివిధాలుగా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో బుధవారం ప్రకాశం భవనంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి జిల్లాలోని నియోజకవర్గ ఆర్‌ఓలు, డీఎస్పీలు, ఏఆర్‌ఓలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, ఈడీటీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైనా వచ్చే అవకాశం ఉందని, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల కోసం సర్వం సన్నద్ధంగా ఉండాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ, పోలీసు శాఖలు మరింత సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆర్‌ఓలను ఆదేశించారు. నోటిఫికేషన్ జారీ నుంచి పోలింగ్ వరకు చేపట్టాల్సిన రోజువారీ విధులపై చెక్‌లిస్ట్‌తో పాటు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఐటీ అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. సీ విజిల్, ఈఎస్ఎంఎస్ సిస్టం, ఇతర అన్ని రకాల అప్లికేషన్లపై అవగాహన ఉండాలన్నారు. ప్రతి అంశానికి సంబంధించి జిల్లా స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. అదేవిధంగా నియోజకవర్గ స్థాయిలో కూడా నియమించామన్నారు. ఆర్‌ఓలు ఎన్నికల విధులు పర్యవేక్షిస్తూ సక్రమంగా జరుగుతున్నాయా లేదా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంసీసీ, ఈఎస్ఎంఎస్, సీవిజిల్, తదితర వాటి నుంచి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులకు పంపుతారన్నారు. ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) కు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే సకాలంలో విచారణ చేసి నివేదికలు అందించేలా ఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలు ప్రశాంత వాతారణంలో జరిగేలా విధులు నిర్వహించాలన్నారు.

ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో కూడా అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. జిల్లాలో చెక్‌పోస్టులు నడుస్తున్నాయని అక్కడ సీజర్స్ ముఖ్యమన్నారు. సైబర్ క్రైం కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తొలుత నియోజకవర్గాల వారీగా ఆర్వోలు ఆయా నియోజకవర్గాల్లో చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో జోష్

- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి మేరుగు
- జలజీవన్ మిషన్‌కు శంకుస్థాపన



పులికొండలో వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పులికొండ పంచాయతీలోని మైలవరం గ్రామంలో బుధవారం 10 కుటుంబాలకు చెందిన గాలిముట్టు బాబూరావు, గుంటూరు లక్ష్మయ్య, యాసారపు శ్రీనివాసరావు, యుగంధర్, గుంటూరు రోశయ్య, ఎస్తేరమ్మ, నాగార్జున, బ్రహ్మయ్య, కోటయ్య మంత్రి సమక్షంలో పార్టీలో చేరటంతో వారికి పార్టీ కండువాలతో ఆహ్వానం పలికారు. మంగళవారం రాత్రి బూదవాడ గ్రామంలో జరిగిన సచివాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీకి చెందిన జే.బ్రహ్మయ్య, వీ.గోవిందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరటంతో వారికి పార్టీ కండువాలు కప్పి మంత్రి పార్టీలో చేర్చుకున్నారు. చీమకుర్తి మండలంలోని పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరటంతో ఆ పార్టీలో జోష్ పెరిగి కార్యకర్తలలో ఉత్సాహం నెలకొంది. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ, మాజీ ఎంపీపీ మేదరమెట్ల ఈశ్వరమ్మ, పార్టీ నాయకులు మేదరమెట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

రూ.59 లక్షలతో జలజీవన్ మిషన్‌కు శంకుస్థాపన: సంతనూతలపాడు మండలంలోని మంగమూరు గ్రామంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున చేతుల మీదుగా రూ.59 లక్షలతో నిర్మించనున్న జలజీవన్ మిషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎస్సీ రైతులకు భూమి కొనుగోలు పథకం ద్వారా 27 ఎకరాలకు రుణ విముక్తి పట్టాలను మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎప్పుడూ పేదలు, దళితులకు అండగా ఉంటుందనే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, అబ్బూరి శంకర్‌రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికలకు పటిష్టంగా ఏర్పాట్లు

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం అమరావతి నుంచి ఎన్నికల ప్రధాన అధికారి కలెక్టర్‌తో వీడియో సమావేశం నిర్వహించారు. ఫామ్ 6, 7, 8 పెండెన్సీలు, ఎపిక్ కార్డుల జారీ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తోపాటు ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి, జేసీ గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ శ్రీలత, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలను కలెక్టర్ వివరించారు. పెండింగ్‌లో ఉన్న 6,178 ఫామ్ 6, 7, 8 దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత వారంలో 13,500 పెండింగ్‌లో ఉండగా వాటిలో 7300 పరిష్కరించామని వివరించారు. జిల్లాకు చేరిన 1.25 లక్షల ఎపిక్ కార్డులను ఈ నెల 28వ తేదీ నాటికి పంపిణీ చేస్తామని చెప్పారు. మరో 65 వేల ఎపిక్ కార్డులు రావాల్సి ఉందన్నారు.

ఖైదీల విడుదలకు పథకం అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పూచీకత్తులు, జరిమానాలు చెల్లించలేక జిల్లా కారాగారం, ఉపకారాగారాల్లో మగ్గుతున్న విచారణ, శిక్ష ఖైదీల విడుదలకు పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రకాశంభవనంలో బుధవారం జిల్లా స్థాయి సాధికార కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేద ఖైదీలకు మద్దతు పథకం- సామాజికంగా వెనుకబడిన, పేద వర్గాలకు చెందిన ఖైదీలకు బెయిల్ పూచీకత్తు, జరిమానా మొత్తాన్ని చెల్లించే ఆర్థిక స్తోమత లేని వారి విడుదలకు సహాయం చేయడమే లక్ష్యంగా మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఆర్థిక సహాయం కోసం పేద ఖైదీలను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రతి పేద ఖైదీకి బెయిల్ పొందడం లేదా జరిమానా చెల్లించడం కోసం ఆర్థిక సహాయం అవసరాన్ని అంచనా వేయడానికి ప్రతి జిల్లాలో సాధికార కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగా తొలి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు జిల్లాన్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామ్‌బాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కమ్‌చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కె.సత్యకుమారి, ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి, జిల్లా కారాగారం అధికారి పి.వరుణారెడ్డి, ఇతర అధికారులు వెంకటరెడ్డి, వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పది పరీక్షల పరిశీలకుడు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్

ఒంగోలు: పదో తరగతి పరీక్షల నిర్వహణలో పరీక్షల విధులకు నియమితులైన ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని పరీక్షల పరిశీలకుడు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ ఆదేశించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశమందిరంలో బుధవారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి పరిధిలో నియమితులైన 80 పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, 17 మండలాల విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ప్రారంభం అవుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, జిరాక్స్ సెంటర్ల మూసివేత తదుపరి అంశాలపై దృష్టి సారించాలన్నారు. పరీక్షా కేంద్రం సమీపంలో ఏ ఒక్కరూ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరీక్ష గదిలోని ప్రశ్నాపత్రంలోని ఒక్క ప్రశ్న కూడా బయటకు లీక్ కారాదన్నారు. అందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాన్ని వివరించారు. పరీక్ష హాలులోనికి అరగంట ముందే విద్యార్థులను అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సాయుధ పోలీసులను ఉంచడంతో పాటు బాలికలను ప్రత్యేక గదిలో మహిళా సిబ్బందితో తనిఖీలు నిర్వహించాలన్నారు. మాల్ ప్రాక్టీస్ రహితంగా పరీక్షలు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఎవరైనా ఇన్విజిలేటర్ మాల్ ప్రాక్టీస్‌కు సహకరిస్తే ఆయనపై కూడా పరీక్షల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు 800 మంది ఇన్విజిలేటర్లతో పాటు అన్ని పరీక్షా కేంద్రాల్లో వసతులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి అనితరోజ్‌రాణి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్, జెడ్పీ పీటీవో సోమా సుబ్బారావు, ఎంఈఓలు కిషోర్, డి.వెంకారెడ్డి, డీసీఈబీ కార్యదర్శి వై.వెంకట్రావు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 100 కుటుంబాలు

- ఒంగోలు 31వ డివిజన్‌లో టీడీపీకి ఎదురుదెబ్బ
- నాలుగు దశాబ్దాలుగా టీడీపీనే నమ్ముకున్నా గుర్తింపు లేదని ఆవేదన
- బాలినేని ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కృషిచేస్తామని స్పష్టం
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



టీడీపీ నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: నగరంలోని 31వ డివిజన్ విజయనగర్ కాలనీలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గత 40 ఏళ్లుగా టీడీపీనే నమ్ముకుని ఉన్న తమ్మిశెట్టి బసవయ్యతో పాటు దాదాపు 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కాకుమాను సునీల్‌రాజ్, ఏడుకొండలు, నితిన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక విజయనగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మిశెట్టి బసవయ్య, తమ్మిశెట్టి శివకృష్ణ, తమ్మిశెట్టి శ్రీను, తమ్మిశెట్టి రమేష్, తమ్మిశెట్టి ఏడుకొండలు, తమ్మిశెట్టి వెంకట్రావు, కందిపల్ల కృష్ణ, తన్నీరు కుమార్, బండారు రమేష్ , బండారు ఏసయ్యల ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి టీడీపీలో ఉన్నా కనీస గుర్తింపు లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇటీవల ఒంగోలులో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల్లో తమ కాలనీ వాసులకు ఎక్కువ మందికి దక్కాయని, అందుకే తామంతా వాసన్న సమక్షంలో పార్టీలో చేరుతున్నామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో వాసన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల క్రితమే యరజర్ల వద్ద 25 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని, కానీ టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. పేదలకు పట్టాలు ఇవ్వడం అంటేనే తెలుగుదేశం నాయకులకు ఇష్టం ఉండదని మండిపడ్డారు. ప్రస్తుతం రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇస్తుంటే దొంగ పట్టాలు అంటూ తెలుగుదేశం నాయకులు ఎద్దేవా చేయడం బాధాకరమన్నారు. వారు ఇవ్వరు, మరొకరు ఇస్తుంటే ఓర్చుకోలేని మనస్తత్వం ఉన్న నాయకులకు సరైన గుణపాఠం చెప్పేందుకు పేదలంతా ఐక్యం కావాలన్నారు. పెత్తందారులు వారి పెత్తందారి వ్యవహార శైలితో పేదల జీవితాలతో ఆడుకోవాలని యత్నిస్తున్నారని, ఇటువంటి వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు జడా వెంకటేష్, యనమల నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంజి ఏడుకొండలు, 31వ డివిజన్ అధ్యక్షుడు స్వరూప్, రాజు, సోను సప్లయర్స్ యానాదిరావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, పసుపులేటి శ్రీనివాసరావు, తన్నీరు నాగేశ్వరరావు , నితిన్‌రెడ్డి, కాకుమాను సునీల్‌రాజ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో 'ప్రగతి రథం'

- ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించిన ఘనత సీఎం జగనన్నదే..
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్
- సింగరాయకొండ బస్టాండ్‌లో రూ.80 లక్షలతో చేపట్టిన పనులు ప్రారంభం



సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్, పక్కన ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, బత్తుల సుప్రజ తదితరులు

సింగరాయకొండ(మర్రిపూడి): ఏపీఎస్ ఆర్టీసీని నష్టాల ఊబి నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో సుమారు రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, నెల్లూరు జోన్ చైర్‌పర్సన్ బత్తుల సుప్రజతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కోస్టల్ ప్రాంతంలో ఒంగోలు తర్వాత ముఖ్యమైన బస్‌స్టేషన్ సింగరాయకొండ అని పేర్కొన్నారు. కందుకూరు, కనిగిరి, పామూరు తదితర ప్రాంతాల రైలు ప్రయాణికుల కోసం ప్రతి ఆర్టీసీ బస్సు సింగరాయకొండలో ఆగేలా చర్యలు తీసుకోవాలని, రాత్రి పూట మహిళల భద్రతకు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్ ప్రహరీకి రూ.15 లక్షల మంజూరు చేయాలని చైర్మన్‌కు సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులకు అండగా నిలిచారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేస్తానని ప్రకటించింది కానీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు.

ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయడంతో 53 వేల మంది ఉద్యోగులు సంతోషంగా ఉన్నారన్నారు. వీరికి ఒకటో తేదీనే రూ.290 కోట్ల వేతనం అందిస్తున్నామన్నారు. ఉద్యోగుల కృషితో ఆర్టీసీ లాభాల బాట బాటపట్టిందని పేర్కొన్నారు. త్వరలోనే ఆర్టీసీకి 1,500 డీజిల్ బస్సులు, 1,000 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయని, అవసరమైతే అద్దె ప్రాతిపదికన అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు. కాగా బస్టాండ్ అభివృద్ధికి సహకరించిన చైర్మన్ మల్లికార్జునరెడ్డికి ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌పర్సన్ బత్తుల సుప్రజ ధన్యవాదములు తెలిపారు. ఆర్టీసీ ఈడీ ఆదాం సాహెబ్, ఆర్ఎం సుధాకర్ బాబు, డీఎం డి.శ్రీనివాసరావు, ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ షేక్ షకీల, సర్పంచ్ తాటిపర్తి వనజ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, పార్టీ నేతలు పామర్తి మాధవరావు, మాలె రంగారెడ్డి, మలినేని వెంకటేశ్వర్లు, యన్నాబత్తిన చిన్నా, చుక్కా కిరణ్‌కుమార్, రాపూరి ప్రభావతి, ఎంపీటీసీ అంబటి ప్రసాద్, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, పాడిబండ్ల కోటేశ్వరరావు, చిడిపూడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో దాచేసిన దొంగ చంద్రబాబు

- చెప్పింది చేయడమే వైఎస్సార్ సీపీ విజన్
- వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు

దర్శి: తన పాలనలో మేలు జరిగితేనే ఓటు వేయండని అడిగే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక 20వ వార్డులో మన ఊరు మనశివన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆయన సతీమణి బూచేపల్లి నందినీలకు ఘన స్వాగతం పలికారు. తొలుత కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. పేదలందరికీ ఇళ్లు ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పిస్తున్న దేశచరిత్రలో ఒకే ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. మంచి చేసింది చెప్పుకోవడానికి లేక ఓట్లు కోసం పొత్తులకు పాకులాడే వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిన ఒక్క మంచి కార్యక్రమం కూడా లేదన్నారు. ప్రజలంతా తేడాలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలు గుంపులుగా కలసి వచ్చినా వైఎస్సార్ సీపీని విజయాన్ని అడ్డుకోలేరన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ ఎంబాషా, వ్యవసాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, తుళ్లూరి బాబురావు, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, కర్నా మహేశ్వరి భాస్కర్‌రెడ్డి, పాలకొలను పాపిరెడ్డి, కృష్ణారెడ్డి, రవిచంద్రారెడ్డి, చిన్నపురెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, ఇండ్ల జనార్దన్‌రెడ్డి, శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, రంగసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉడుముల వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.25 కోట్లతో రంగాపురం-అర్ధవీడు రోడ్డు


- భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి.
- 70 కి.మీ ప్రయాణం 7 కి.మీకు తగ్గడంతో ప్రజల హర్షం



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల

అర్ధవీడు(కంభం): రంగాపురం-అర్ధవీడు రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో ప్రయాణ భారం తగ్గుతుందని గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. రెండు పాయలుగా ఉన్న అర్ధవీడు మండలంలో రంగాపురం నుంచి మండల కేంద్రమైన అర్ధవీడుకు వెళ్లాలంటే సుమారు 70 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. అదే రంగాపురం నుంచి ఫారెస్టు మీదుగా రోడ్డు నిర్మిస్తే కేవలం 7 కి.మీ ప్రయాణించి అర్ధవీడుకు చేరుకోవచ్చు. ఆ తరుణం కోసం ఇక్కడి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. వారి ఆశలను నెరవేరుస్తూ ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం రూ.25 కోట్లు మంజూరు చేయగా బుధవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌ను మరో మారు సీఎంగా చేసుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యురాలు చెన్నువిజయ, రిటైర్డ్ డీఈ వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ రవికుమార్ యాదవ్, పీఆర్ డీఈ వి. ప్రసాదరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం





రథోత్సవంలో పాల్గొన్న భక్తులు(ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో మార్కండేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శివపార్వతుల రథోత్సవం భక్తుల శివనామ స్మరణ మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రతిష్ఠించి అర్చకులు తేజ శర్మ, ఆంజనేయశర్మ పూజలు చేశారు. మహిళల కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. ఎమ్మెల్యే అన్నా రాంబాబు కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ కేశవ శర్మ, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీఎస్పీ బాల సుందరరావు ఆధ్వర్యంలో సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వరనాయక్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఐ టీడీపీ ఆగడాలకు కళ్లెం వేయాలి



చీమకుర్తి : కేవీ పాలెం రోడ్డులో జగనన్న కాలనీ వాసులు



యర్రగొండపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మహిళలు



నాగులుప్పలపాడులో ర్యాలీలో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున, మహిళలు



సీఐకి వినతి పత్రం అందిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం బాధ్యులు

ఒంగోలు సెంట్రల్/ నాగులుప్పలపాడు/ యర్రగొండపాలెం/చీమకుర్తి: ప్రభుత్వం చేసిన మంచిని సంతోషంగా చెప్పిన తెనాలికి చెందిన మహిళ జి.గీతాంజలిని సోషల్ మీడియా వేదికగా అసభ్య పదజాలంతో ట్రోలింగ్ చేసి ఆత్మహత్యకు పురిగొల్పిన టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజని బ్రహ్మేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో సీఐ భక్త వత్సల రెడ్డికి ఫిర్యాదు అందించారు. తక్షణమే స్పందించి గీతాంజలి కుటుంబాన్ని ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ● నాలుగులప్పలపాడులో గీతాంజలి మృతికి సంతాపంగా మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమెను అసభ్యంగా ట్రోల్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

● చీమకుర్తి కేవీపాలెం రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. యర్రగొండపాలెంలో సర్పంచ్ ఆరుణాబాయి, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు పల్లె సరళ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో టీజేఆర్ భేటీ

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని తాడేపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై ఇరువురూ చర్చించారు.

విజన్ ఉన్న సీఎం వైఎస్ జగన్

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి

ఒంగోలు అర్బన్: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం పైనే కాకుండా యువతను ప్రజాసేవ చేసేలా ప్రభుత్వ పరంగా ఎలా వినియోగించాలో తెలిసిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకర్ల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. తమ ఫెడరేషన్ ప్రభుత్వానికి అండగా నిలుస్తూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ముందుందని అన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన 6 నెలల్లోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు వివిధ శాఖల్లో ఉద్యోగులకు వేతనం పెంచారని గుర్తు చేశారు. నెలకు రూ.300 కోట్లు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని తెలిసినా ఆర్టీసీని ప్రభుత్వంలోకి తీసుకున్న ధైర్యశాలి వైఎస్ జగన్ అని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కరోనా సమయంలోనూ ఆర్టీసీ ఉద్యోగులు జీతాలు అందుకున్నారన్నారు. ప్రజలకు పాలన చేరువ చేయాలన్న విజన్‌తో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.30 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించారని పేర్కొన్నారు. వైఎస్ జగన్ చేసిన మేలును సచివాలయ ఉద్యోగులు జీవితాంతం గుండెల్లో ఉంచుకోవాలన్నారు. కరోనా కష్ట కాలంలోనూ పేదలకు సంక్షేమ పథకాలు అందించారని, ఆ కారణంతో ఉద్యోగులకు కొంత మేర ఇబ్బంది కలిగినా వైఎస్ జగన్ ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉన్నారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అభివృద్ధి చిహ్నాలుగా నిలుస్తున్నాయన్నారు. మెడికల్ కాలేజీలు, పోర్టుల నిర్మాణం, పరిశ్రమలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నా ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని, వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఉద్యోగులను కోరారు.

బాలుడి కిడ్నాప్ కలకలం

3 గంటల్లోనే గుర్తించిన పోలీసులు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ లక్ష్మణ్

ఒంగోలు సిటీ: ఫిర్యాదు అందిన మూడు గంటల వ్యవధిలో తప్పిపోయిన బాలుడిని పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు ఒంగోలు పట్టణానికి చెందిన వై.కాశీవిశ్వప్రసాద్ కుమారుడిని బుధవారం ఉదయం 11.40 సమయంలో తల్లి మందలించగా బాలుడు ఇంటి నుంచి పుస్తకాల బ్యాగు తీసుకొని సైకిల్ మీద వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో తల్లిదండ్రులు రాత్రి 7 గంటలకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో రంగంలోకి దిగిన రెండు పోలీసు బృందాలు మూడు గంటల్లోనే బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐ లక్ష్మణ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.